



» ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టిన బీజేపీ సిట్టింగ్ ఎంపీ
» అభ్యర్థి ఎంపిక కోసం కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం
» బీఆర్ఎస్ నుంచి ఎవరు పోటీ చేస్తారో!? » ఇంకా రాని స్పష్టత

'పార్లమెంట్'పై ప్రధాన పార్టీల కసరత్తు

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తుండగా, బీజేపీ ఇప్పటికే ప్రచారాన్ని చేపట్టింది. సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌తో పాటు ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కార్యకలాపాలను చేపట్టలేదు. పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు కీలకం అయినా.. బీఆర్ఎస్ నేతలు మాత్రం ఇప్పటి వరకు క్యాడర్‌కు స్పష్టత ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు బలమైన నేతలను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. దాదాపు సీటు ఖాయంకావడంతో సిట్టింగ్ ఎంపీ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌కు కీలకమే. మూడు పార్టీలకు కూడా సీట్లు అవసరమే. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండగా రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంది. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఎంపీ సీటు గెలవడం అత్యంత కీలకం పార్టీ తరపున ఎక్కువ మంది ఎంపీలు ఉంటే కేంద్రం నుంచి సహకారాలు అందే అవకాశం ఉంది. ఈ దఫా రాష్ట్రంలో ఎక్కువ సీట్లపై నజర్ పెట్టిన బీజేపీ నేతలు ముందస్తుగానే ప్రచారాలను మొదలుపెట్టారు. ఐదు క్లస్టర్లుగా రాష్ట్ర పార్లమెంట్ నియోజకవర్గాలను విభజించి ఈ ప్రచారాన్ని మొదలుపెట్టారు. గడిచిన నెల రోజులుగా ఎంపీ అర్వింద్ జిల్లాలో పర్యటన కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యే విధంగా చూస్తున్నారు. పనులు పూర్తయిన వాటిని ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. అయితే ఈసారి అసంతృప్తులు అధికంగా ఉండడంతో.. వారిని బుజ్జగిస్తూ అర్వింద్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మరింత ఎక్కువగా నియో జకవర్గాల్లో ప్రచారం చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నియోజకవర్గంలో ఒక దఫా ప్రచారాన్ని పూర్తిచేసే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● సామాజిక వర్గాల ఆధారంగా నివేదిక

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఏఐసీసీకి పంపించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూడా సామాజిక వర్గాల ఆధారంగా ముగ్గురు అభ్యర్థుల వివరాలను ఏఐసీసీకి నివేదించారు. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి రావడం, ఆరు గ్యారంటీల అమలులో ముందుకు పోతుండడం, వాటిని ప్రచారాస్త్రాలుగా చేసుకుని ముందుకు పోయేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పార్లమెంట్ షెడ్యూల్ లోపే జిల్లాలోని సీనియర్ నేతలలో కొంతమందికి నామినేటెడ్ పదవులను ఇచ్చి అందరినీ సమన్వయంతో పనిచేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంపీ సీట్లను గెలుచుకునే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే ఈ నియోజకవర్గంపై రెండు దఫాలు చర్చించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నేతల ను పిలిచి బలా బలాలపైన సమీక్షించారు. సర్వేల ఆధారంగా సీట్లను కేటాయించారు. అభ్యర్థి ఎవరైనా అందరూ సమన్వయంతో పనిచేసే విధంగా నిర్ణయానికి వచ్చారు. సీనియర్ నేతలందరికి భవిష్యత్తులో రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులు వచ్చే అవకాశం ఉన్నందు వల్ల నిజామాబాద్ పార్లమెంట్ సీటును గెలిచేందుకు నేతలు ప్రయత్నాల్లో ఉన్నారు.

బీఆర్ఎస్‌లో కనిపించని ఏర్పాట్లు

కాంగ్రెస్, బీజేపీలు ప్రచారంపై నజర్‌పెట్టి నిమగ్నం కాగా, బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. రెండు దఫాలు హైదరాబాద్‌లో సమీక్షించినా జిల్లా స్థాయిలో సమావేశాలను ఇంకా నిర్వహించలేదు. నిజామాబాద్ అర్బన్ పరిధిలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆత్మీయసమ్మేళనం నిర్వహించగా.. బాల్కొండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. మిగతా నియోజకవర్గాల్లో ఇంకా సన్నాహక సమావేశాలను చేపట్టలేదు.

కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థుల ఎంపికపై క్లారిటీ వచ్చినా బీఆర్ఎస్‌లో ఎవరు పోటీ చేస్తారో ఇంకా తేలలేదు. ఈ దఫా బీసీ అభ్యర్థిని బరిలోకి దించుతారని ప్రచారం జరుగుతున్నా.. పార్టీ నేతలు మాత్రం ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. నియోజకవర్గాల పరిధిలో నేతలు అందు బాటులో ఉండకపోవడం వల్ల క్యాడర్‌లో కొంత మంది ఇతర పార్టీలవైపు మొగ్గుతున్నారు. వచ్చే నాలుగైదు రోజుల్లో జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆ సమావేశాల్లో ఏ అభ్యర్థిని బరిలోకి దించుతారో, ఎవరెవరు పోటీలో ఉంటారో తెలిసే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

ఐదేళ్ల ఎంపీగా అర్వింద్ జిల్లాకు చేసింది శూన్యం

» దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం
» బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మరు
» నిజామాబాద్ పార్లమెంటు స్థానం కాంగ్రెస్‌దే..
» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి22: సీఎం కూతురు కవితను ఓడించి నిజామాబాద్ పార్లమెంటు ప్రజలు ఎంపీగా అర్వింద్‌ను గెలిపిస్తే గత ఐదేళ్లలో జిల్లాకు ఎంపీగా ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలప్పుడు బాండ్ పేపర్‌తో ప్రజలను మోసం చేసిన అర్వింద్ ప్రధాని చేత ప్రకటించిన పసుపుబోర్డును స్థాపించకుండానే పేపర్లకే పరిమితం చేశాడన్నారు. ఎంపీగా అర్వింద్ నిజామాబాద్ నగరపాలక సంస్థను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదో జవాబు చెప్పాలన్నారు. నిజామాబాద్ కంటే కరీంనగర్ చిన్న నగరమైనా ఎంతో అభివృద్ధి చెందిందని, నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్‌సిటీగా చేయలేదో అర్వింద్ చెప్పాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ప్రజలు ఎవరిని గెలిపించాలో ఆల్‌రెడీ డిసైడ్‌అయి ఉన్నారని, ఈ సారి ఎంపీకి పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. తమకు ఇతరుల వల్లే దయభక్తి ఎక్కువేనని, నిత్యం దేవుళ్లను పూజిస్తామని, కానీ బీజేపీ వాళ్ల లాగా దేవుళ్లతో రాజకీయం చేయమన్నారు. జిల్లా ప్రజలు చాలా విజ్ఞులని, ఎవరిని ఎక్కడ ఉంచాలో తెలుసన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లతో పాటు నిజామాబాద్ ఎంపీ సీటును సైతం కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఎందుకు కాంగ్రెస్‌ను గెలిపించలేదోనని అంతర్మథనంలో ఉన్నారన్నారు. అందరి సహకారంతో తాను ఎమ్మెల్సీగా నియమితులయ్యారని, 35 ఏళ్ల తర్వాత పదవి లభించిందని, ఇది జిల్లా ప్రజల ఆశీస్సులవల్లే వచ్చిందన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని, త్వరలో జిల్లా నాయకులంతా సీఎంను కలిసి నగరాభివృద్ధికి నిధులు కోరుతామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, నాయకులు రత్నాకర్, హేమలత అగర్వాల్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రజొన్నకు మంచి ధర

● క్వింటాకు రూ.4,100 చెల్లించిన వ్యాపారులు



ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి22: ఆర్మూర్ ప్రాంతంలో రైతులు పండించిన ఎర్రజొన్న పంటకు గురువారం మంచి ధర పలికింది. మండలంలోని అంకాపూర్ గ్రామంలో క్వింటాకు రూ.4100 రైతులకు చెల్లించి ఎర్రజొన్నలను వ్యాపారులు కొనుగోలు చేశారు. సుమారు వంద లారీల ఎర్రజొన్నలను కొనుగోలు చేయగా.. అందులో 50లారీల జొన్నలకు రూ.4,100, మరో 50లారీల జొన్నలకు రూ.4,075 ధర చెల్లించినట్టు తెలిసింది. గత సంవత్సరం క్వింటాకు రూ.3800లోపే ధర పలికింది. ఆ సమయంలో ఎర్రజొన్నలు నిల్వ చేసుకున్న వారికి రూ.4300వరకు పెరిగింది. నిజామాబాద్‌లోని ఆర్మూర్, బాల్కొండ నిజామాబాద్ రూరల్ ఏరియాతో పాటు నిర్మల్, మెట్‌పల్లి ప్రాంతాలలో ఎర్రజొన్న పంట ఎక్కువగా సాగు చేస్తుంటారు. సుమారు 46 వేల ఎకరాలలో ఎర్రజొన్న సాగవుతాయి. ఆర్మూర్ మండలంలోని ఆరు వేల ఎకరాల్లో ఎర్రజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం పలు గ్రామాల్లో రైతులు వ్యాపారులతో ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నారు. పెర్కిట్‌లో క్వింటాలుకు రూ.3,950నగదు చెల్లించేందుకు వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్మూర్ ప్రాంతంలో నాలుగు రకాల జొన్నలు సాగు చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు డిల్లీకి చెందిన వ్యాపారులు నేరుగా రైతుల నుంచి ఎర్రజొన్నలు కొనుగోలు చేస్తున్నారు. ఎర్రజొన్న క్వింటాలుకు రూ.4 వేలపైనే ధర పలికితే రైతులకు మంచి లాభాలు సాధించి పెడుతోంది.

27 నుంచి విజయ సంకల్ప యాత్ర

» జిల్లాలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ నాయకులు
» ఇప్పటికే పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు




హైదరాబాద్‌లో యాత్రను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈనెల 27నుంచి విజయ సంకల్ప యాత్ర కోసం బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం ముందస్తుగా ప్రచారాన్ని మొదలు పెట్టారు. నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడంతో పాటు పార్లమెంట్ పరిధిలో జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో మూడు రోజుల పాటు సంకల్ప యాత్ర కొనసాగడం రాష్ట్ర, జాతీయ స్థాయి పార్టీ నేతలు హాజరవుతుండడంతో విజయవంతంగా చేసేందుకు మండలవారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ క్యాడర్ అంతా హాజరయ్యే విధంగా చూస్తున్నారు. విజయ సంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లను పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ముందే అన్ని పార్లమెంట్‌లో ఒక దఫా ప్రచారాన్ని నిర్వహించేందుకు బీజేపీ నేతలు సిద్ధమయ్యారు. రెండు రోజుల క్రితం కొమ రంభీమ్ విజయ సంకల్ప యాత్రను నిర్మల్ జిల్లా ముథోల్ లో ప్రారంభించారు. ఈ యాత్ర ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహించి పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తారు. ఆ రెండు పార్లమెంటరీ నియోజకవర్గాలు పూర్తయిన తర్వాత ఈనెల 26న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఆరోజు జగిత్యాలలో పూర్తి చేసుకొని 27న జిల్లాలోని కమ్మర్‌పల్లి వద్ద బీజేపీ నేతలు ప్రవేశిస్తారు. కమ్మర్‌పల్లి నుంచి భీంగల్ మీదుగా ధర్పల్లి, డిచ్‌పల్లి మండలాల్లో పర్యటిస్తారు. ఆర్మూర్‌లో ఆరోజు సభ నిర్వహిస్తారు. ఈనెల 28న ఆర్మూర్ నుంచి నంది పేట-నవీపేట మీదుగా బోధన్‌కు చేరుకుంటారు. బోధన్‌లో కొమురం భీమ్ విజయసంకల్ప యాత్రను ముగిస్తారు. ఈనెల 29న ముగింపు సభను నిజామాబాద్‌లో నిర్వహిస్తారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే ఈ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు ఈటల రాజేందర్ ఇతర నేతలు పాల్గొంటారు. జిల్లాలోని పార్లమెంట్ పరిధిలో జరిగే ఈ విజయసంకల్ప యాత్ర కోసం భారీ ఏర్పాట్లను పార్టీ నేతలు చేస్తున్నారు. ఎంపీ అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో ముందస్తుగా అన్ని నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

ఈ-పంచాయతీ ఇక్కట్లు



గ్రామ పంచాయతీలో మూలనపడ్డ కంప్యూటర్



» గ్రామాల్లో వినియోగంలో లేని సేవలు
» కంప్యూటర్లు ఇచ్చారు.. కనెక్షన్లు మరిచారు
» ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

మండల పరిషత్ కార్యాలయం ద్వారానే సేవలు..

● నరహరి, డీపీఎం, నిజామాబాద్

గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆపరేటర్లు, ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయం ద్వారానే ప్రజలకు సేవలందిస్తున్నాం. ప్రభుత్వం ఆపరేటర్లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తే ఈ పంచాయతీ సేవలను గ్రామాల్లో అమలుకు చర్యలు తీసుకుంటాం.



లింగాపూర్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సామగ్రి

కోటగిరి, ఫిబ్రవరి 22: నేటి ఆధునిక కాలంలో ప్రపంచాన్ని కంప్యూటర్ శాసిస్తుందనడంతో ఎలాంటి సందేహం లేదు. కాలానుగుణంగా గ్రామ పంచాయతీలలో పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం పంచాయతీలకు లక్షల రూపాయల వెచ్చించి కంప్యూటర్లను అందించింది. అయితే కంప్యూటర్లు అందించి ఏళ్లు గడుస్తున్నా.. నేటి వరకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించకపోవడంతో కంప్యూటర్లు వృథాగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 15ఏళ్ల క్రితం జిల్లాలో గ్రామ పంచాయతీలను క్లస్టర్‌లుగా ఏర్పాటు చేశారు. 271 క్లస్టర్లకు కంప్యూటర్లను అందజేశారు. కేవలం 100గ్రామ పంచాయతీలకు మాత్రమే ఇంటర్నెట్ సేవలను కల్పించారు. ఈ పంచాయతీ సేవలు నేటికీ అందుబాటులోకి రాలేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయకుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇంటి పన్ను రసీదు, ఇతరత్రా సేవలు ప్రజల ముంగిట్లోకి వచ్చే అవకాశం లేకుండా పోయింది.

ఆపరేటర్ల జాడే లేదు

ఈ పంచాయతీలకు అందజేసిన కంప్యూటర్ల ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలను అందించడానికి ఆపరేటర్లు అవసరం. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క పంచాయతీలో కూడా ఆపరేటర్ల నియామకం చేపట్టలేదు. పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తే వినియోగంలోకి వచ్చేవి. కానీ ఇటు శిక్షణ ఇవ్వలేదు. అటు ఆపరేటర్లను నియమించకపోవడంతో ప్రజలు మీసేవ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాయి.

కోటగిరి మండలంలో 10కంప్యూటర్లు

మండలాల పునర్ విభజనకు ముందు కోటగిరి ఉమ్మడి మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండేవి. 24గ్రామ పంచాయతీలలో 10 పంచాయతీలకు కంప్యూటర్లను అందజేశారు. రుద్రూర్ మండలంలో 4గ్రామ పంచాయతీలు విలీనం చేయగా కోటగిరి మండలంలో 20పంచాయతీలను 28గ్రామ పంచాయతీలుగా పునర్ విభజన చేశారు. ప్రస్తుత కోటగిరి ఉమ్మడి మండలంలో కోటగిరి, పొతంగల్, ఎత్తొండ, సుంకిని, హంగర్గ, కారేగాం, కల్లూర్, కొల్లూర్, సుద్దులం గ్రామాలలో కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో అవి మూలనపడ్డాయి. కారేగాం, సుద్దులం పంచాయతీలలో కంప్యూటర్లను మండల పరిషత్ కార్యాలయంలో వినియోగిస్తున్నారు. కోటగిరి, పొతంగల్, ఎత్తొండ, కల్లూర్ గ్రామాలలో కంప్యూటర్లు వినియోగంలో ఉన్నాయి. హంగర్గ, సుంకిని, కొల్లూర్ గ్రామాలలో కంప్యూటర్లు మూలన పడ్డాయి. కోటగిరి, పొతంగల్, కల్లూర్, ఎత్తొండ గ్రామాలలో మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకుని కంప్యూటర్లను వినియోగిస్తున్నారు.

ఇంటర్నెట్ సౌకర్యం ఎప్పుడో ?

లక్షలు వెచ్చించి గ్రామ పంచాయతీలకు అందజేసిన కంప్యూటర్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించలేదు. జిల్లాలో 271పంచాయతీలకు కంప్యూటర్లు అందించారు. వీటిలో కేవలం 100 పంచాయతీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. మరికొన్ని చోట్ల ప్రైవేటు వ్యక్తులకు ఉపయోగపడుతున్నట్లు తెలిసింది.

ప్రింటర్లు కూడా ఇవ్వలేదు

ఈ పంచాయతీలకు కంప్యూటర్లతో పాటు ప్రింటర్లను అందించాల్సి ఉండగా.. ఎక్కడా వీటిని అందించలేదు. పల్లెల్లో అభివృద్ధి కోసం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం ఈ పంచాయతీ కార్యక్రమాలకు శ్రీకారం చుడితే క్షేత్రస్థాయిలో మాత్రం ఒక వైపు కంప్యూటర్ల నుంచి ఇంటర్నెట్ సదుపాయాన్ని మరిచారు. మరో వైపు ఆపరేటర్లు, ప్రింటర్ల ఊసే లేకపోవడం విశేషం. ఇప్పటికైన ఈ పంచాయతీ సేవలు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిషత్‌లోనే ఆపరేటర్లు

గ్రామాలలో ప్రజలకు అందాల్సిన కంప్యూటర్ సేవలు మండల పరిషత్ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. ప్రతీ మండలంలోనూ 5నుంచి ఆరుగురు కంప్యూటర్ ఆపరేటర్లను మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ప్రతీ నెల 19,500రూపాయలు వేతనాలు అందిస్తున్నారు. గ్రామ పంచాయతీలలో అందాల్సిన సేవలు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ప్రజలు పొందుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ పంచాయతీ సేవలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సంధ్య

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 22: కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బక్కి సంధ్యను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్రకార్యదర్శిగా నియమిస్తూ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఆమె కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఈసందర్భంగా సంధ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు వచ్చేలా చేసిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తారకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.

గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,ఫిబ్రవరి22: వేసవికాలం సమీపిస్తుండడంతో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాలలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలం గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా నీటి సమస్యను రానివ్వకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించి తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని అన్నారు. గ్రామాలలో ఉన్న మౌలిక సమస్యలను గుర్తించి వాటి ని పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. కూనేపల్లి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాలలోని పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యలు లేకుండా జూన్ నాటికి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం బాగేపల్లి గ్రామంలోని సీతారామాంజనేయ సమేత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేను సన్మానించారు.

● కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మండలంలోని కూనేపల్లి, కళ్యాపూర్, కిసాన్ తండా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కిసాన్ తండా తాజా మాజీ సర్పంచ్ జమున, కళ్యాపూర్ మాజీ ఉప సర్పంచ్ జలయ్య, కూనేపల్లి మాజీ సర్పంచ్ భర్త లింగం, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయలకే సిలిండర్ పథకాలను మరో వారం రోజుల్లో అమలు చేస్తామని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సాయరెడ్డి, జావీదోద్దీన్, నితిన్, కార్తీక్, మోహన్, కిరణ్, పోచయ్య, కృష్ణ, సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం

● రైతులు ఆందోళన చేపడితే పోలీసుల కాల్పులు జరపడం బాధాకరం : ఏఐపీకేఎస్



ఆర్మూర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి22: రైతు వ్యతిరేక చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రతీఒక్కరు నిరసించాలని ఏఐపీకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, రాష్ట్ర సహాయకార్యదర్శి బి.దేవరాంలు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో రైతు వ్యతిరేక చర్యలు చేపట్టడంతో లక్షలది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఢిల్లీ సమీపంలో రైతులు తమ న్యాయమైన డిమాండ్‌ల సాధనకు ఆందోళన చేపడితే పోలీసుల కాల్పుల్లో యువ రైతు మృతి చెందడం బాధాకరమన్నారు. గతంలో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఈనెల 13వ తేదీన హామలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించారన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో రోడ్లపై మేకులు కొట్టి డ్రోన్‌ల ద్వారా రైతులపై బాష్పవాయువు ప్రయోగించడం శోచనీయమన్నారు. ఎన్నికల వాగ్దానంలో రైతులకు రెండింతల ఆదాయం తెచ్చిపెడతానని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ నీటి మూటల తయారైందని విమర్శించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచి రైతు ఉద్యమంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాల్పుల్లో మృతి చెందిన సుభకరన్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్, ఏఐపీకెఎస్ నాయకులు ఆకుల గంగారాం, గంగాధర్, ఇస్తారి రమేష్, నరేందర్, అశోక్, నిఖిల్, మహేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

బోధన్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా నాయకులు మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలన్నింటికీ ఎంఎస్‌పీ చట్టం చేయాలంటూ ఢిల్లీకి వెళ్లిన రైతులపై కాల్పులు జరిపి రైతుల ప్రాణాలను తీస్తున్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. మోదీ గుజరాత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుపుకుని ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసి రైతు చట్టాలపై వినతిపత్రం ఇచ్చారని, నేడు ప్రధానమంత్రి అయ్యాక రైతులు అమలు చేయాలని కోరుతుంటే నిరాకరిస్తుండంతో సరికాదన్నారు. మోదీ రైతు వ్యతిరేకి అని బడా కార్పొరేట్‌లకు, మల్టీనేషనల్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా దేశ రైతాంగ డిమాండ్‌లను ప్రధాని పరిష్కరించాలని, లేనట్లయితే రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు పడాల శంకర్, సీతారామ్, ఇస్మాద్, శంకర్, బాలు, ఖాజా, మౌనాజీ, గణపతి, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఖిల్లా రామాలయంలో వైభవంగా గరుడ సేవ



దేవత మూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్థులు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 22: మండలంలోని ఖిల్లా రామాలయంలో శ్రీ సీత రామచంద్ర స్వామి తిరుక్కల్యాణోత్సవ వేడుకలు ప్రధాన అర్చకుడు సుమిత్ శర్మదేశ్ పాండే ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి ఘనంగా గరుడోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకు హోమం, బలిహరణం, నిర్వహించారు. రాత్రికి గరుడ వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఉత్సవ మూర్తులతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సభ్యులు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూరమాధురి, ఆసది జితేందర్, మాజీ సర్పంచ్ రాధకిష్టరెడ్డి, బూస సుదర్శన్, ఏజీదాసు, మాజీ విండో చైర్మన్ జైపాల్, వీడీసీ సభ్యులు చిన్న సాయిలు, వారాల సాయిలు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, దువ్వ నర్సింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నేడు రథోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సాగునీరు అందించాలని ఎమ్మెల్యేకు రైతుల వినతి


నవీపేట,ఫిబ్రవరి22: మండలంలోని రాంపూర్, లక్ష్మి కిసాన్ ఫారం, ఫత్తేనగర్‌కు చెందిన పలువురు రైతులు గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిశారు. నిజామాబాద్ నుండి రెంజల్ పర్యటనకు వెళ్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని నవీపేట వద్ద రైతులు కలిశారు. అలీసాగర్ ఎత్తిపోతల పథకంకు చెందిన డీ50/5 ఉప కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉండగా చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడం లేదని వారు పేర్కొన్నారు. సంబంధిత ఉప కాలువకు పూడిక తీయించడంతో పాటు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదలను మరో 15రోజుల పాటు పొడిగించాలని వారు కోరారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు అభంగపట్నం వద్ద ఉన్న ఎర్రగుంట రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటితో నింపే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్, రాములు, శ్రీనివాస్, నిజాముద్దీన్, అజీం, రహీం తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,ఫిబ్రవరి22: మండల కేంద్రానికి చెందిన బూస కిషన్(65)అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండలంలోని అభంగపట్నంలో ఆర్ఎంపీగా పని చేస్తున్న కిషన్ ఈ నెల 7న సాయంత్రం నవీపేట నుండి అభంగపట్నంకు స్కూటీపై వెళ్తుండగా బాసర నుండి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే అతనిని నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాలు జరగక ముందే స్పందించాలి

● రోడ్డు మధ్యలో భారీ గుంత ● వాహనదారుల ఇబ్బందులు



తిమ్మాపూర్‌లో బీటీరోడ్డుపై ఏర్పడిన గుంత

మోర్తాడ్, ఫిబ్రవరి22: ప్రధానరహదారి మధ్యలో భారీగుంత ఏర్పడి నెల రోజులు కావస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోని ఉదంతంఇది. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మధ్యలో ఈగుంత ఏర్పడింది. హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైప్‌లైన్ ఈ రోడ్డు కింద నుంచి తీసుకెళ్లారు. కాగా పైప్‌లైన్ ఏర్పాటులో నాసిరకం పనులు జరగడంతో రోడ్డు మధ్యలో కుంగిపోవడంతో గుంత ఏర్పడింది. మోర్తాడ్ నుంచి మండల కేంద్రమైన ఏర్గట్లకు వెళ్లే ప్రధానరహదారి అయినందున వాహన దారులు ఇబ్బందులుపడుతున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం రైతులు తమ తోటల్లోకి పశువుల పెండను లారీల ద్వారా సరఫరా చేసుకుంటున్నారు. అంతేగాక రైతులు పసుపు పంటను కూడా మార్కెట్‌కు తీసుకు వెళ్తున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత వల్ల భారీ వాహనాదారులు ఇబ్బందులుపడుతున్నారు. నెల రోజులు కావస్తున్న సంబంధిత శాఖ అధికా రులు స్పందించడంలేదని తిమ్మాపూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లైబ్రరీలో పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22: తెలంగాణ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ పుస్తకాలు, ఎంట్రెన్స్, న్యూ ఎడిషన్ బుక్స్ అదే విధంగా లైబ్రెరిలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరే శ్రీశైలం మాట్లాడుతూ.. లైబ్రెరీలో లైట్స్ కూడా సరిగా లేవని వాటిని తక్షణమే పెట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాగర్ నాయక్, అల్లూరి రాజేందర్, మహేశ్ పాల్గొన్నారు.

'కుల బహిష్కరణ చేశామనడం అవాస్తవం'



బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న కుల పెద్దలు

బీర్కూర్, ఫిబ్రవరి 22: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన బుడిమ సాయిలు అనే వ్యక్తి తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని ఆరోపించడం, పూర్తిగా అవాస్తవమని మున్నూరు కాపు కుల సంఘం పెద్దలు పేర్కొన్నారు. సాయిలు ఆరోపణలను కుల సంఘం పెద్దలు ఖండించారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడిమ సాయిలు గత కొన్నాళ్ళ క్రితం మృతి చెందాడని, అప్పటి నుంచి సాయిలుకు తన వదినకు మధ్య ఆస్తి పంపకాలకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయని అన్నారు. ఈ విషయంలో కుల పెద్దలు ఒక పరిష్కారం చూపగా అందుకు సాయిలు అంగీకరించలేదన్నారు. అనంతరం సాయిలు కుల సంఘం పెద్దలపై కక్ష కట్టారని, తమ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారంటూ కొత్త నాటకాన్ని తెర లేపారని విమర్శించారు. ఆస్తి పంపకాల విషయం వారి కుటుంబానికి సంబంధించిన వ్యవహారమని అందులో కుల పెద్దలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సాయిలు కుటుంబ సభ్యులు అన్ని శుభ, అశుభ కార్యక్రమాలకు హాజరవుతున్నారని కుల పెద్దలు తెలిపారు. అయినా సాయిలు కుల బహిష్కరణ చేశారంటూఆరోపించడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కుల పెద్దలు సానెపు గంగారాం, యామ రాములు, అవారి గంగారాం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో వాహనాల తనిఖీలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలో గురువారం ఎఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేని వాహనాలకు, నెంబర్లు ప్లేట్లు లేని వాహనాలకు మొత్తం 26 వాహనాలకు రూ. 3110 జరిమానా విధించినట్లు తెలిపారు. వీటితో పాటు మద్యం తాగి వాహనం నడిపిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనదారులు తప్పక ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.

హిందూ ధర్మం ఎంతో పవిత్రమైనది : విద్యారణ్య భారతి స్వామి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి

రెంజల్,ఫిబ్రవరి22: అన్ని ధర్మాల కన్నా హిందూ ధర్మం చాలా పవిత్రమైనదని విద్యారణ్య భారతి స్వామి, మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. గురువారం మండలంలోని బాగేపల్లి గ్రామంలో అభిష్ట సీతారామచంద్ర లక్ష్మణ, హన్మంత సమేత స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, హనుమాన్ శివపంచాయుతన నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విద్యారణ్య భారతి స్వామి, పిట్ల కృష్ణ మహరాజ్ చేతుల మీదుగా ప్రతిష్ఠాపన చేపట్టారు. మూడు రోజుల పాటు వేద పండితుల సమక్షంలో యజ్ఞం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పవిత్రమైనదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాలలో ఆయాలను నిర్మించేందుకు ప్రతి ఒక్కరు సహాయ, సహకారాలు అందించినప్పుడే ధర్మాన్ని కాపాడిన వారిమవుతామని స్పష్టం చేశారు. కొంతమంది ధర్మాన్ని చిన్నభిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సాయిలు, సురేందర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు సాయగౌడ్, గోపి, గ్రామ పెద్దలు సాయిబాబాగౌడ్, గంగాధర్, భాస్కర్,మధు తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,ఫిబ్రవరి22: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన గురువారం ప్రాతకాల పూజ, మండపారాధన, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, బలిదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి, మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ పిట్లకృష్ణ మహరాజ్, నవీపేట లింగమయ్య గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్త ధర్నాచౌక్ ఏర్పాటు

ఖిల్లా, ఫిబ్రవరి 22 :జిల్లా ప్రజలకు ప్రజాసంఘాల సంస్థలు నిరసన తెలిపే హక్కును సద్వినియోగం చేసుకునేందుకు కొత్తగా ధర్నాచౌక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎవరైనా ధర్నాను నిర్వహించాలను కుంటే ఇంతకు ముందు మాదిరి పాత కలెక్టరేట్ పరిధిలోని ధర్నా చౌక్ వద్ద ధర్నాలు, నిరసలు నిర్వహించేవారు. దాని సమీపంలో రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్,కోర్టుసముదాయం, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారి ఉండడంతో ప్రజలకు రవాణ సౌకర్యాలకు తీవ్ర ఇబ్బందులు కలిగేవి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో వేయి చదరపు గజాల స్థలం అర్బన్‌లోని ఆబాది ప్రాంతంలో (పాత మున్సిపల్ కార్యాలయం పక్కన గల స్థలానికి సర్వేయర్ హద్దులు నిర్ణయించారు. ఇకపై ధర్నాలు నిరసన కార్యక్రమాలు ఈ ప్రదేశంలోనే చేయాలని సూచించారు. నిరసన కార్యక్రమాలు చేపట్టే వారు ముందుగా నిజామాబాద్ ఏసీపి అనుమతి పొందిన తర్వాతనే నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. లేని యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణలో సీఎస్‌డీవోలే కీలకం

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 22 : ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు కీలకమని డీఐఈవో రఘురాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియమనిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఈనెల 28నుంచి మార్చి 19వరకు పరీక్షల నిర్వహణకు 57పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 35వేల 346విద్యార్థులు పరీక్షలకు హాజరు కా నున్నారన్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉం డదని,ఎలాంటి ఎలాక్ట్రానిక్ పరికరాలను అనుమతించమన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుల్లో ఉంటుందని పరీక్ష కేంద్రాల్లో మౌ లిక వసతులు కల్పిస్తామన్నారు.ఈసమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌సీఎస్‌డీవోలు,పరీక్షలనిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు దుకాణం తెరిచిన వ్యక్తికి జైలు

ఖిల్లా, ఫిబ్రవరి 22: అర్ధరాత్రి వరకు దుకాణం తెరిచి ఉంచిన గైక్వాడ్ సంతోష్ అనే వ్యక్తికి రెండురోజుల పాటు కారాగార శిక్ష విధిస్తూ రెండో శ్రేణి అదనపు న్యాయాధికారి తీర్పు చెప్పారని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. గైక్వాడ్‌సంతోష్ నిర్ధిత సమయం తర్వాత తమ వ్యాపార సముదాయాన్ని నడిపించినందున సిటీ పోలీసు యాక్ట్ ప్రకారం కోర్టు నందు హాజరుపర్చడం జరిగిందన్నారు. దీంతో కోర్టు రెండురోజుల శిక్ష విధించడం జరిగిందన్నారు.నగరంలోని హోటళ్ యాజమాన్యాలు నిర్ణీత సమయంలో వ్యాపారలావాదేవీలను మూసివేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.

బీమా పాలసీ చెక్కు అందజేత



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22: నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం గ్రామా నికి చెందిన పుప్పాల బాబు ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. పాలసీదారుడు గత సంవత్సరం నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం పోస్టాఫీసులో రూ.520 పాలసీ ప్రమాద భీమా చేయించుకున్నాడు. అయిన నామిని పుప్పాల రేఖకు రూ.10 లక్షల ప్రమాద భీమా చెక్కును నిజామాబాద్ డివిజన్ సీనియర్ సూపరిం టెండెంట్ చేతుల మీదుగా ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.520 ఇన్సురెన్స్ పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ పోస్టు జనార్ధన్‌రెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ భూమన్న, మేనేజర్ పవన్‌రెడ్డి, మెయిల్ ఓవర్సీస్ మహబూబ్‌రెడ్డి, సురేష్, బీపీఎంలు పాల్గొన్నారు.

కొలిప్యాక్‌లో అనందగిరి లక్ష్మీనర్సింహస్వామి జాతర

● నేడు స్వామివారి కళ్యాణోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి22: మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ ఆనందగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం కొండపై లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి శుప్రభతసేవ, పంచమృతాభిషేకం, సర్వదేవతపూజ, గరుడ పఠాధివాసం, బలిహ రణం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో భక్తుల కోసం అన్న దానం నిర్వహించారు. శుక్రవారం లక్ష్మీనర్సింహస్వామివారి కల్యాణో త్సవం నిర్వహించనున్నారు. 24న జాతర, రథోత్సవం, 25న చక్రతీర్థం, సాయంత్రం స్వామివారి నాగవెళ్ళి, డోలాసేవ ఉత్సవాలు నిర్వహిస్తు న్నామని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు తెలిపారు.

కోటగిరి ఉమ్మడి మండలంలో బీఆర్ఎస్‌కు షాక్

కోటగిరి,ఫిబ్రవరి22: కోటగిరి ఉమ్మడి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, కార్యకర్తలు గురువారం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యాద్గార్‌పూర్ మాజీ సర్పంచ్ కృష్ణ కుమార్, బస్వాపూర్ ఉప సర్పంచ్ శ్రీధర్, కొడిచర్ల మాజీ సర్పంచ్ ఈర్వంత్, బీఆర్ఎస్ నాయకులు భీంరావుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

ఈద్గా నిర్మాణం కోసం భూమిపూజ



నసురుల్లాబాద్‌లో ఈద్గా నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న మైనార్టీ నాయకులు

బీర్కూర్, ఫిబ్రవరి 22: నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఈద్గా నిర్మాణం కోసం గురువారం నాయకులు, మైనారిటీలు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంది మల్లేష్ మాట్లాడుతూ నూతన ఈద్గా నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. నిర్మాణం కొరకు ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ. 5 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. త్వరలో ఈద్గా నిర్మాణ పనులు పూర్తి చేసి మైనారిటీ సోదరులకు ఈద్గాను అందుబాటులోకి తీసు కొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీలు ఖలీల్, యూసుఫ్, అస్గర్ అలీ, ఫయాజ్, వసీం, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల నియామకం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22:పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసు పత్రిలో 26మంది స్టాఫ్ నర్సుల నియామకం చేసినట్టు ఆసుపత్రిసూపరింటెండెంట్ బి.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వంద పడకల ఏరియాఆసుపత్రిలో సిబ్బంది కొరతపై ప్రస్తవించారు.దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి 26 మంది నర్సింగ్ స్టాఫ్‌లను నియామిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అడవిని కాపాడితే భవిష్యత్ బాగుంటుంది



అడవిలోని నిప్పుని ఆర్పే విధానాన్ని తెలుపుతున్న డిప్యూటీ ఎఫ్ఆర్‌వో

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 22: అటవీ సంపదను కాపాడుకుంటే భవిష్యత్తు బాగుంటుందని ఇందల్‌వాయి రేంజ్ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో గురువారం అటవీకి నిప్పు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో కొందరు అటవీలో నిప్పు వేస్తూ విలువైన అటవీ సంపదను కాల్చివేస్తున్నారని ఎవరు కూడా అటవీలో నిప్పు వేయరాదని సూచించారు. వేటగాళ్లు అటవీ జంతువులను వేటాడం నేరమని అన్నారు. గొల్లకుర్మలు గొర్రెలు, మేకలను మేపడానికి అటవీలోకి తీసుకెళ్తూ చెట్లను నరికి వేయడం తప్పని ఎవరు కూడా చెట్లను నరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు అటవీ భూములను వ్యవసాయ భూములుగా మార్చేందుకు పెద్ద చెట్లను నరికి వేస్తున్నారని తమ దృష్టి వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి లభించాలంటే అటవీ సంపదను మరింత పెంచుకోవాల్సిన అవసరముందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితగంగాదాస్,మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పవన్, రంజిత్, రాకేష్, తదితరులు ఉన్నారు.

5నుంచి బీఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఎడ్ 3వ సెమిస్టర్ చదువతున్న విద్యా ర్థులకు మార్చి 5నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారిణి ప్రొ.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ లో అందుబాటు లో ఉంచామని పేర్కొన్నారు.

మండలంలోని పలు పాఠశాల తనిఖీ

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి22: మండలంలోని పెర్కిట్, కొటార్మూర్, చేపూర్‌లతో పాటు గురువారం పట్టణంలోని ఒడ్డెరకాలనీలలో గల పాఠశాలలను ఎంఈవో రాజగంగారాం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీ గ్రేడ్ గల విద్యార్థులకు ప్రత్యేక చొరవ తీసుకొని బేసిక్ విద్యను అందించాలని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసుకొని పాఠశాలలకు విద్యార్థులు ప్రతీరోజు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా!?

● విద్యుత్ అధికారుల నిలువెత్తు నిదర్శనం

ఎల్లారెడ్డి,ఫిబ్రవరి 22: ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన గాంధీ చౌక్ వద్ద ఇనుప స్తంభానికి రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడంతో గ్రామంలో ప్రజలు పాఠశాల విద్యార్థులు ఆ రోడ్డు వైపు ఎక్కువగా రాకపోకలు జరుగుతాయి. గతంలో ఒక పశువు కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ప్రధా న రహదారిపై ఉండటంతో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రజలు పాఠశాల విద్యా ర్థులు అటువైపు రాకపోకలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. గతంలో విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించిన కాని కేవలం సిమెంట్ స్తంభం వేసి సిమెంట్ స్తంభానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం మర్చిపోయారు. అధి కారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ప్రమాదవశాత్తు ఉందని ఇకనైనా అధికా రు లు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇనుప స్తంభానికి ఉన్న వైర్లను ట్రాన్స్‌ఫా ర్మర్లను తొలగించి సిమెంట్ స్తంభాన్ని బిగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కళ్యాణిలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు

- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.



సమ్మక్క గద్దె

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.



క్యూలైన్లలో భక్తుల రద్దీ







ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

పాడి పరిశ్రమకు మంచి డిమాండ్



అమ్రాద్‌లో మాట్లాడుతున్న పీడీ డీఆర్‌డీఏ సాయాగౌడ్

మాక్లూర్, ఫిబ్రవరి22: ప్రస్తుత పరిస్థితుల్లో పాడి పరిశ్రమకు మంచి డిమాండ్ ఉందని పీడీ డీఆర్‌డీఏ సాయాగౌడ్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అమ్రాద్ గ్రామంలో పాడి పరిశ్రమ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీడీ డీఆర్‌డీఏ సాయాగౌడ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తి తక్కువ ఉన్నందున సరియైన మోతాదులో పాలు దొరకకా ప్యాకెట్ పాలు వినియోగిస్తున్నారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నేర్చుకొని అందరు పాల ఉత్పత్తిని పెంచి స్వయం ఉపాధి పొందాలన్నారు. పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథచారి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పశువుల పెంపకం తగ్గిందని, పాలు పితకడం కూడా చాలా కష్టంగా మారిందని,, దీనికి కారణం పాల ఉత్పత్తిపైన అవగాహన లేకపోవడం, పాల యొక్క ప్రాముఖ్యత, పాలలో దొరికే పోషకాలపై సరియైన అవగాహన లేకపో వడంతో పశుసంవర్ధఖ ద్వారా అవగాహన కల్పిస్తున్న అనుకున్నంత ఫలితాలు రావ డంలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బ్రాంచ్ మేనేజర్ వినయ్, డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, ఎంపీడీవో క్రాంతి, రాజయ్య, డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, డాక్టర్లు ఉమమ సాహెర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏర్గట్లలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం, జాతర

ఏర్గట్ల,ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం నిత్యహోమం, సాయంత్రం రథహోమం, రథబలి, రాత్రి 9గంటల 43నిమిషాలకు రథోత్సవము జాతర నిర్వహించనున్నారు. శనివారం ఆలయం వద్ద గ్రామాభివృద్ధి, ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇట్టి ఉత్సవాలకు మండలంలోని భక్తులు పాల్గొనలన్నారు.

గిరిజన గురుకుల బాలికల భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 22:మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో గిరిజన గురుకుల బాలికల భవన నిర్మాణానికి రూ.5కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.63లక్షలతో గురువారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20వేల కోట్లలను బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఇటీవల గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని విద్యా వ్యవస్థ కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మెగా డీఎస్సీ ద్వారా భారీ ఉద్యోగ నియమకాలను చేపడ్తామని అన్నారు. స్వంత కమీషన్ల కోసం కక్కుర్తిపడి నాసిరకంగా పనులు చేపట్టిందని అన్నారు. నాసిరకం పనులతో కాళేశ్వరం వందేళ్లుండాల్సింది మూడేళ్లకే కుంగిపోయిందని ఎద్దేవా చేశారు. త్వరలోనే కులగణన చేపట్టి దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణాను నిలుపుతామని తెలిపారు.ఈకార్యక్రమంలో స్థానిక ఎంపీపీ.రమేష్‌నాయక్, వైస్ ఎంపీపీ. అంజయ్య, మాజీ ఎంపీపీ. ఇమ్మడి గోపి, కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, స్థానిక ఎంపీటీసీలు చింతలదాస్, సుధాకర్, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

● పోడు భూముల సమస్యను పరిష్కరిస్తా

ధర్పల్లి:పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రామరావ్ మహారాజ్ 3వ వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో నిర్మించిన రామారావ్ మహరాజ్ పూలమాలలు వేశారు. .బడ్జెట్‌లో రూ.40వేల కోట్లను ఎస్టీ,ఎస్సీలకు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల బంజార సేవా సంఘం అధ్యక్షుడు లాల్‌సింగ్‌నాయక్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిరికొండ: పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయమని అడుగుతున్న రైతాంగాన్ని కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆరోపించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రప్రసాద్, డీటీడబ్ల్యూవో నాగరావు, జడ్‌పీటీసీ సభ్యులు మాన్‌సింగ్,ఎంపీటీసీ సభ్యులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పత్రికలపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి22:పత్రికలపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు అని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్న 'ఆంధ్రజ్యోతి', ఈనాడు, పత్రికలు, టీవీ చానళ్లపై వైఎస్ఆర్ సీపీ నాయకులు దాడులు చేయడం ప్రజా స్వామ్యానికి ముప్పు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పత్రికలపై అసత్యాలను ప్రచారం చేయడం తమ కార్య కర్తలను పత్రికా విలేకరులపై ఉసిగొలపడం సరికాదని విమర్శించారు. ఇటీవల అనంతపురం జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టడం కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై దాడి చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దాడు లకు బాధ్యులైన వైఎస్ ఆర్ పార్టీ నాయకులను కఠినంగా శిక్షించా లని ఆయన డిమాండ్ చేశా రు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాథ మిక హక్కుల పరిరక్షణ,పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

నెంబర్‌ప్లేట్ లేని వాహనాల సీజ్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22: పట్టణంలోని నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గురువారం సీజ్ చేసినట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిలో నెంబర్ ప్లేట్‌లు పెట్టడం, అలాగే రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా, సైలెన్సర్‌లను మారుస్తూ ఇష్టారీతిన తిరుగుతున్న 20వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రతీఒక్కరు మోటర్ వెహికిల్ చట్టం ప్రకారం వాహనాలు ఉండాలని ఆయన సూచించారు.

బడ్జెట్ సమావేశం గరం..గరం..!

- నిరసనతో మొదలైన కార్పొరేషన్ సమావేశం
- మీడియాకు అనుమతి లేకపోవడంపై నిరసన
- పలు అంశాలపై వాడీవేడి చర్చ
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.274కోట్ల 89 లక్షలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్



వాగ్వాదానికి దిగిన బీజేపీ,ఎంఐఎం నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22: నిజామాబాద్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం గతంలో ఎన్నడూ లేనంతగా గరం గరంగా సాగింది. ఎప్పుడూ లేనంతగా నిరసనలు, ఆందోళనలతో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ దండు నీతు కిరణ్ అధ్యక్షతన గురువారం 2024-25 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగం చదువుతుండగానే.. ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు బడ్జెట్‌ను చదవకుండా నిరసన వ్యక్తం చేశారు. మీడియాను అనుమితించక పోవడంపై ప్రతిపక్ష సభ్యులు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది సేపు మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. మీడియాకు అనుమతి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నగరంలోని సమస్యలను బయటకు తీసేందుకు మీడియా అవసరమని, మీడియాను అనుమతించాలని కోరారు. దీంతో చాలా సేపు బడ్జెట్ ప్రసంగానికి ఆటంకం కలిగింది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ కలుగచేసుకుని మీడియాకు అనుమతి నిరాకరణపై సభ్యులు తీర్మానం చేసి పంపాలని.. రానున్న రోజుల్లో ప్రభుత్వంతో మాట్లాడి మీడియాకు అనుమతి వచ్చేలా చూస్తానని చెప్పడంతో సభ్యులు శాంతించారు. బీజేపీ సభ్యులు ఇందూరు నగర కార్పొరేషన్ అని సంబోధించడంతో ఎంఐఎం కార్పొరేటర్లు అడ్డుపడి వాగ్వాదానికి దిగారు. నిజామాబాద్ కార్పొరేషన్‌ను ఇందూరు అని ఎలా సంబోధిస్తారని వాగ్వాదం జరిగింది. అనంతరం బడ్జెట్ ప్రసంగం కొనసాగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీహన్మంతు, కమిషనర్ మందమకరంద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● టౌన్ ప్లానింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని అధికారులు టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలు చేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. కంఠేశ్వర్ బైపాస్‌లో ఓవ్యక్తికి ప్రభుత్వ భూమి అంటూ నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించారని ప్రస్తుతం అదే భూమిలో ఓప్రైవేటు వ్యక్తి దర్జాగా కబ్జా చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటూ టౌన్‌ప్లానింగ్‌ను తమ స్వంత కంపెనీలా మార్చుకున్నారని సభ్యులు మండిపడ్డారు.

● పలు డివిజన్ల సమస్యలపై సభ్యుల నిలదీతలు

పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్ సమస్యలపై గొంతెత్తారు. చాల డివిజన్లలో కనీస సౌకర్యాలు లేవని సమస్యలను విన్నవించారు. దోమల, కుక్కల నివారణపై సభ్యులు ప్రశ్నించారు. ఎన్ని కుక్కలకు సర్జరీలు చేశారో వాటి కోసం ఎంత ఖర్చు చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. వాణిజ్య సముదాయాలకు పన్నులు లేవని వాటికి ట్యాక్స్ వేసేలా చూడాలని అన్నారు. మాస్టర్‌ప్లాన్‌పై పలువురు సభ్యులు లేవనెత్తారు. డివిజన్‌లో డ్రైనేజీలు, రోడ్లు, తదితర సమస్యలపై కార్పొరేటర్లు మాట్లాడారు.సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కోరారు.

● బడ్జెట్ ఆమోదం

నగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించింది. ఏఆర్థిక సంవత్సరానికి గాను 274కోట్ల 89లక్షల బడ్జెట్‌ను ఆమోదించింది.ఇందులో మున్సిపల్‌శాఖ ఆదాయం ద్వారా రూ.90కోట్లుఆదాయం,డిపాట్లద్వారా రూ.7 కోట్ల 20లక్షలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.177కోట్ల60లక్షలు మొత్తంరూ.274కోట్ల 89లక్షలుగా ఆమోదించారు.

● నగరాభివృద్ధికి రూ.200 కోట్లు విడుదల చేయాలి: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ నగర అభివృద్ధికి రూ.200కోట్లు విడుదల చేయాలి. గతంలో సమావేశాలు తూతూ మంత్రంగా జరిగాయి. మేయర్ సైతం సమాధానాలను దాటవేస్తూ వస్తున్నారని అన్నారు. అధికారులు సైతం ఎలాంటి నివేదికలు లేకుండానే వస్తున్నారు. సరైన సమాధానాలు చెప్పడం లేదు. పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్‌లను వెంటనే వసూలు చేయాలి. నగర అభివృద్ధికి పాటుపడాలి. లేకపోతే ప్రజల తరపున పోరాడుతాం.

● డివిజన్‌కు రూ.కోటి నిధుల పనులను పూర్తి చేయాలి : న్యాలం రాజు

డివిజన్‌కు కోటి రూపాయల నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టిన ఇప్పటికి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పనులను జాప్యం చేస్తున్నారు. పనులను వెంటనే పూర్తి చేయాలి.పులాంగ్ వాగుపై బ్రిడ్జి నిర్మించి వదిలివేశారు. నిర్మాణాన్ని పూర్తి చేయాలి అర్హతలు లేకున్నా జవాన్లను ఎస్‌ఐలుగా ప్రమోట్ చేశారు.దీనిపై విచారణ చేపట్టాలి.

● నగరంలో గంజాయిని అరికట్టాలి (గడుగు రోహిత్,కార్పొరేటర్)

నగరంలో గంజాయి విచ్చల విడిగా దొరుకుతుంది. గంజాయి తాగి యువకులు చెడిపోతున్నారు. గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. గంజాయి అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలి. ఆస్పత్రి ప్రాంగణంలో ట్రాఫిక్ చలాన్లను వేయకుండా చూడాలి.